క్లుప్తంగా

ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు



విశేషాలంకరణలో ఆంజనేయస్వామి

పొదలకూరు : పట్టణంలోని మారుతీనగర్‌లో ఉన్న వీర అభయాంజనేయస్వామికి అర్చకులు మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం ఆకుపూజ, అభిషేకాలు, ప్రత్యేక పూజలు, సాయంత్రం స్వామికి పల్లకి సేవ గావించారు.

సీసీరోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన



కోవూరు : మండలంలోని చిన్నపడుగుపాడులో శ్రీనగర్ ప్రాంతంలో 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.20 లక్షలతో సీసీరోడ్డు నిర్మాణానికి మంగళవారం శంకుస్థాపన చేశారు. తొలుత సర్పంచ్ లక్ష్మీనారాయణ పూజా కార్యక్రమాలు చేసి పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో డీఎల్డీఏ డైరెక్టర్ కాటంరెడ్డి దినేష్‌రెడ్డి, ఉప సర్పంచ్ అహ్మద్, పంచాయతీ కార్యదర్శి కృష్ణమూర్తి, వార్డు సభ్యులు ఉన్నారు.

అయ్యప్పస్వామికి విశేష పూజలు నేడు

పొదలకూరు : స్థానిక శివాలయం ప్రాంగణంలో ఉన్న అయ్యప్పస్వామి దేవస్థానంలో బుధవారం 46వ అంబళపూజ జరుగుతుందని అయ్యప్ప సేవా సమాజం మంగళవారం వెల్లడించింది. శాస్త్రపూజ, భక్తులకు అన్నదాన కార్యక్రమం ఉంటుందని తెలిపారు. భక్తులు పూజలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించాల్సిందిగా కోరారు.


సీవీ రామన్‌ను ఆదర్శంగా తీసుకోవాలి



సీవీ రామన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

కోవూరు : విద్యార్థులు సర్ సీవీ రామన్‌ను ఆదర్శంగా తీసుకోవాలని హెచ్ఎం నరసింహమూర్తి తెలిపారు. కోవూరులోని పచ్చిపాల రామనాథమ్మ జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో సీవీరామన్ జయంతిని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం విజ్ఞాన శాస్త్రంలో రామన్ సేవల గురించి తెలియజేశారు. కార్యక్రమంలో సైన్స్ ఉపాధ్యాయులు కె.భారతి, టి.ఝాన్సీరాణి, ఈ.రాజేశ్వరి, విద్యార్థులు ఉన్నారు.

విధుల నుంచి తొలగించారని ఆందోళన



ఆందోళన చేస్తున్న భానుచందర్

మనుబోలు : తనను విధుల నుంచి అన్యాయంగా తొలగించారంటూ వీరంపల్లి సబ్‌స్టేషన్ ఎదుట చిట్టేటి భానుచందర్ అనే వ్యక్తి కుటుంబంతో సహా మంగళవారం ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను 2014 నుంచి సబ్‌స్టేషన్‌లో షిఫ్ట్ ఆపరేటర్‌గా పనిచేస్తున్నానన్నారు. కారణం చూపకుండానే అక్టోబర్ నుంచి తనను విధుల నుంచి తొలగించారని వాపోయారు. ఈ విషయమై ఈఈ ఇస్మాయిల్‌ను వివరణ కోరగా అతని ప్రవర్తన సరిగ్గా లేదని, గ్రామస్తులు, రైతుల నుంచి ఫిర్యాదులు రావడం వల్లే తొలగించామని తెలిపారు.

అంతరాయాల్లేని విద్యుత్ సరఫరాకు చర్యలు

• ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి



సబ్‌స్టేషన్ కోసం స్థల పరిశీలన చేస్తున్న ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

కోవూరు (బుచ్చిరెడ్డిపాళెం) : బుచ్చిరెడ్డిపాళెం పట్టణ ప్రజలతో పాటు సమీప గ్రామాల్లోని రైతులు, ప్రజలకు అంతరాయాల్లేని నాణ్యమైన విద్యుత్ సరఫరాకు చర్యలు తీసుకుంటున్నట్లు కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో విద్యుత్ శాఖకు సంబంధించిన 4.08 ఎకరాల స్థలంలో 132 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణం చేపట్టేందుకు అధికారులతో కలిసి ఎమ్మెల్యే ప్రసన్న మంగళవారం స్థల పరిశీలన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 132 కేవీ సబ్‌స్టేషన్ నిర్మాణానికి సుమారు రూ.5 కోట్ల నిధులు ఖర్చవుతుందని, ఈ మేరకు విద్యుత్‌శాఖ అధికారులు అంచనాలు వేశారని తెలిపారు. గతంలో తుఫానులు, భారీ వర్షాల సమయంలో విద్యుత్ సమస్యలు సంభవించేవని, బుచ్చిరెడ్డిపాళెంలోనే సబ్‌స్టేషన్ నిర్మాణం చేపడితే భారీ వర్షాలు, తుఫానులు వచ్చినప్పటికీ 80 శాతం వరకు విద్యుత్ అంతరాయం లేకుండా పర్యవేక్షణ చేయవచ్చన్నారు. సరఫరా విషయంలో కూడా లో-ఓల్టేజీ సమస్యలు తొలగిపోతాయన్నారు. గతంలో కోవూరు, ఆత్మకూరులో 132 కేవీ సబ్‌స్టేషన్లు ఉండేవని, ఈ రెండింటికి మధ్యలో బుచ్చిరెడ్డిపాళెంలో ఈ సబ్‌స్టేషన్ను ఏర్పాటు చేస్తే ప్రజలతో పాటు రైతులకు కూడా ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఈ నిర్మాణ పనులు త్వరలో ప్రారంభమవుతాయని ఎమ్మెల్యే వెల్లడించారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ యువజన విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు నల్లపరెడ్డి రజిత్‌కుమార్ రెడ్డి, ట్రాన్స్‌కో ఈఈ విజయకుమార్‌రెడ్డి, డీఈ శీనయ్య, ఏఈ సురేష్‌బాబు, వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు టంగుటూరు మల్లికార్జునరెడ్డి, పార్టీ మండలాధ్యక్షుడు చర్లో సతీష్‌రెడ్డి, స్థానిక నాయకులు మోర్ల మురళి, విజయభాస్కర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

స్పందన ఫిర్యాదుపై ఆర్డీఓ పరిశీలన



రికార్డులు పరిశీలిస్తున్న ఆర్డీఓ శీనానాయక్

విడవలూరు : మండలంలోని అలగానిపాడు గ్రామంలో ఓ రైతు ఫిర్యాదుపై కావలి ఆర్డీఓ శీనా నాయక్ మంగళవారం పరిశీలించారు. ఇటీవల అలగానిపాడు గ్రామంలోని భూములకు రీసర్వే చేశారు. ఇందులో గ్రామానికి చెందిన కుంచె హనుమాయమ్మ తనకు ఉన్న భూమిలో 15 సెంట్లు తక్కువగా రెవెన్యూ అధికారుల రికార్డుల్లో ఎక్కించారని ఇటీవల కలెక్టర్ కార్యాలయంలో జగనన్నకు చెబుదాంలో ఫిర్యాదు చేశారు. ఇందులో భాగంగా భూములను పరిశీలించి బాధితురాలితో మాట్లాడామని, త్వరలో ఈ సమస్యకు పరిష్కారం చూపుతామని తహసీల్దార్ రమాదేవి తెలిపారు. ఆమె వెంట ఆర్ఐ రమేష్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

పోలేరమ్మకు విశేష పూజలు



ప్రత్యేకాలంకరణలో పోలేరమ్మ

మనుబోలు : మండల కేంద్రంలోని కోదండ రామపురం దేవాంగుల వీధిలో ఉన్న పోలేరమ్మ ఆలయంలో అమ్మవారికి మంగళవారం విశేష పూజలు నిర్వహించారు. అర్చకుడు శ్రీనివాసులు పోలేరమ్మకు పంచామృతాభిషేకం నిర్వహించి ప్రత్యేక పుష్పాలంకరణ చేశారు. అనంతరం విశేష పూజలు జరిపించి భక్తులకు తీర్థ ప్రసాదాలు వితరణ చేశారు. సాయంత్రం మహిళలతో సామూహిక కుంకుమార్చన నిర్వహించి ధూప దీప నైవేద్యాలతో హారతులిచ్చారు. కార్యక్రమానికి ఉభయదాతలుగా గంధళ్ల కృష్ణయ్య, అన్నపూర్ణమ్మ దంపతులు వ్యవహరించారు.

ఎల్లప్పుడూ నాణ్యమైన విద్యుత్ సరఫరా



సబ్‌స్టేషన్‌ను తనిఖీ చేస్తున్న ఈఈ ఇస్మాయిల్

మనుబోలు : రైతులకు, గృహ అవసరాలకు ఎల్లప్పుడు నాణ్యమైన విద్యుత్ సరఫరా అందిస్తున్నామని ట్రాన్స్‌కో ఈఈ ఇస్మాయిల్ అన్నారు. మండలంలోని వీరంపల్లి సబ్‌స్టేషన్ను ఆయన మంగళవారం పరిశీలించారు. గ్రామాలకు విద్యుత్ సరఫరా అయ్యే ఫీడర్లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులకు ఏడు గంటల పాటు నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేస్తున్నామన్నారు. గృహాలకు ఎటువంటి అంతరాయం లేకుండా 24 గంటల నాణ్యమైన విద్యుత్ సరఫరా చేస్తున్నామని తెలిపారు. విద్యుత్‌ను వృథా చేయవద్దని, పొదుపుగా వినియోగించాలని సూచించారు. విద్యుత్ చౌర్యానికి పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట ఏడీ రవికుమార్‌రెడ్డి ఉన్నారు.

కారు, బైక్ ఢీ



ప్రమాదంలో దెబ్బతిన్న కారు

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : మండలంలోని దామరమడుగు జాతీయ రహదారిపై కారు, బైక్ ఢీకొన్న ఘటన మంగళవారం ఉదయం చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. నెల్లూరు నుంచి బుచ్చిరెడ్డిపాళెం వైపు వెళ్తున్న ఇన్నోవా కారు అదుపుతప్పి పొలాల్లోకి దూసుకెళ్లింది. అయితే డ్రైవర్ కారును రోడ్డుపైకి ఎక్కించే క్రమంలో బుచ్చి నుంచి నెల్లూరుకు బైక్‌పై వెళ్తున్న వ్యక్తిని ఢీకొట్టాడు. ఈ క్రమంలో ఇద్దరు వ్యక్తులకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను స్థానికులు నెల్లూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

• వైద్యాధికారి బాలచంద్రబాబు



ఆశా కార్యకర్తలకు సూచనలిస్తున్న వైద్యాధికారి

కొడవలూరు : వర్షాలు కురుస్తున్నందున వ్యాధులు ప్రబలకుండా తగిన జాగ్రత్తలు తీసుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలని కొడవలూరు వైద్యాధికారి జి.బాలచంద్రబాబు సూచించారు. కొడవలూరు పీహెచ్‌సీలో ఆశా కార్యకర్తలతో మంగళవారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతిఒక్కరూ కాచి చల్లార్చిన నీటిని తాగాలని సూచించాలన్నారు. ఎవరైనా జ్వరం బారిన పడితే వెంటనే ఆస్పత్రికి వచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఇటీవల ఆరోగ్య సురక్షలో పలువురిని మెరుగైన వైద్యం కోసం ఎంపిక చేశామని, వారికి ఆరోగ్యశ్రీ ద్వారా మెరుగైన వైద్యం అందించే ఆస్పత్రులకు ఆశా కార్యకర్తలే తీసుకుపోవాలన్నారు. అందుకు రవాణా ఖర్చుల కింద రూ.500 ప్రభుత్వం చెల్లిస్తుందని చెప్పారు. సమావేశంలో సీహెచ్‌ఓ టి.సోమశేఖర్, హెచ్ఎస్ వి.రామ్మోహన్, హెచ్ఏ షఫీఉద్దీన్, ఏఎన్ఎం శేషుబాయి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఓటు హక్కుపై యువతకు అవగాహన

• నుడా వైస్ చైర్మన్ బాపిరెడ్డి



ఓటర్ల వివరాలను పరిశీలిస్తున్న బాపిరెడ్డి

కోవూరు : నియోజకవర్గ పరిధిలోని డిగ్రీ కళాశాల, ఇంజినీరింగ్ కళాశాలల్లో యువతకు ఓటు హక్కుపై అవగాహన కల్పించేలా చర్యలు తీసుకుంటున్నట్లు కోవూరు ప్రత్యేక ఎన్నికలాధికారి, నుడా వైస్ చైర్మన్ బాపిరెడ్డి అన్నారు. కోవూరులోని తహసీల్దార్ కార్యాలయంలో రాజకీయ పార్టీల నేతలతో మంగళవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల నుంచి శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు వెళ్లిన వారు, మృతి చెందిన వారి ఓట్లను తొలగించే విషయంలో ఎన్నికల కమిషన్ ఇచ్చిన నియమ నిబంధనలను తప్పక పాటించాలన్నారు. అదేవిధంగా 18 ఏళ్లు నిండిన ప్రతిఒక్కరూ తమ ఓటును నమోదు చేసుకోవాలన్నారు. దీనికి సంబంధించి ప్రతి పోలింగ్ కేంద్రం పరిధిలో ఉన్న బీఎల్వోలు ప్రజల్లో అవగాహన కల్పించేలా ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అనంతరం ఆయన ఓటు నమోదుకు సంబంధించిన వివరాలను పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎం.పద్మజ, ఎలక్షన్ డిప్యూటీ తహసీల్దార్ మధు, సీనియర్ అసిస్టెంట్ సుధా తదితరులు పాల్గొన్నారు.

బాక్సింగ్ జిల్లా జట్ల ఎంపికలు రేపు

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): జిల్లా పురుషుల బాక్సింగ్ జట్లను ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో గురువారం సాయంత్రం ఐదు గంటలకు ఎంపిక చేయనున్నామని బాక్సింగ్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. విశాఖపట్నంలో ఈ నెల 13 నుంచి 15 వరకు నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి బాక్సింగ్ టోర్నీలో జిల్లా తరఫున వీరు ప్రాతినిధ్యం వహించనున్నారని చెప్పారు. వివరాలకు 94415 24931, 91215 88178 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

15 నుంచి శిక్షణ తరగతులు

నెల్లూరు సిటీ: సీనియర్ ప్రొఫెషనల్ ఫస్ట్ ఎయిడ్ శిక్షణ తరగతులను ఈ నెల 15 నుంచి నిర్వహించనున్నామని రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా కో ఆర్డినేటర్ రవికుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ, సెయింట్ జాన్స్ అంబులెన్స్, న్యూఢిల్లీ ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించనున్నామని చెప్పారు. పాల్గొనాలనుకునే వారు నగరంలోని రెడ్‌క్రాస్ కార్యాలయంలో తమ పేర్లను ఈ నెల 13లోపు నమోదు చేసుకోవాలని కోరారు. వివరాలకు 91000 78571 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

విద్యార్థులకు బహుమతుల ప్రదానం



బహుమతులు అందుకున్న విద్యార్థులు

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : మండలంలోని దామరమడుగు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో యూనియన్ బ్యాంక్ ఆధ్వర్యంలో విజిలెన్స్ అవేర్‌నెస్ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అవినీతి రహిత సమాజంలో విద్యార్థుల పాత్ర అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. అనంతరం ఉపాధ్యాయులు మాట్లాడారు. విద్యార్థులు అవినీతి రహిత సమాజం లక్ష్యంగా ఉన్నత విద్యను అభ్యసించాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం ఎం.సుధాకర్, యూనియన్ బ్యాంక్ మేనేజర్ ఎ.మనోజ్, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పోలేరమ్మకు పొంగళ్లు



విడవలూరు : మండలంలోని రామతీర్థం గ్రామంలో కొలువైన పోలేరమ్మకు వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పూండ్ల అచ్యుత్‌రెడ్డి, సర్పంచ్ అరుణ ఆధ్వర్యంలో మంగళవారం పొంగళ్లు సమర్పించారు. ఐదేళ్లకు ఒకసారి నిర్వహించే ఈ కార్యక్రమంలో భాగంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు, సద్ది, పోతు ఊరేగింపు కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం పొంగళ్లు సమర్పించారు. కార్యక్రమంలో రామలింగేశ్వర స్వామి దేవస్థానం చైర్మన్ నాటూరి చంద్రయ్య, వరిణి సొసైటీ డైరెక్టర్ కాటం శీనయ్య, సచివాలయ కన్వీనర్ నువ్వూరు నరేష్, ఎంపీటీసీ సభ్యురాలు రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ కేసులపై ప్రత్యేక దృష్టి



రికార్డులు పరిశీలిస్తున్న రూరల్ డీఎస్పీ వీరాంజనేయరెడ్డి

కోవూరు : పెండింగ్ కేసుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని నెల్లూరు రూరల్ డీఎస్పీ వీరాంజనేయరెడ్డి తెలిపారు. కోవూరు పోలీస్‌స్టేషన్‌ను మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్‌కు సంబంధించిన పలు రికార్డులు పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. సకాలంలో పెండింగ్ కేసులను పరిష్కరించి దోషులకు శిక్షలు పడేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అదేవిధంగా వివిధ కేసులకు సంబంధించి ముద్దాయిలను సకాలంలో అరెస్టు చేసి వారిని కోర్టుకు హాజరు పరిచేలా దృష్టి సారించాలన్నారు. రాత్రి వేళల్లో గస్తీలు పెంచి చోరీలు జరగకుండా చూడాలన్నారు. ఆయన వెంట ఎస్సై రంగనాథ్‌గౌడ్, హెడ్ కానిస్టేబుల్ రషీద్, వేణు తదితరులు పాల్గొన్నారు.

బాణసంచా దుకాణాలకు లైసెన్స్ తప్పనిసరి

• ఎస్సై అజయ్‌కుమార్



మనుబోలు : దీపావళి సందర్భంగా బాణసంచా దుకాణాలకు లైసెన్స్ తప్పనిసరి అని ఎస్సై అజయ్‌కుమార్ తెలిపారు. మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. బాణసంచా విక్రయించే వారు ముందస్తుగా అనుమతి తీసుకోవాలన్నారు. అనుమతుల్లేకుండా బాణసంచా విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. బాణసంచా నిల్వ చేసినా, అక్రమంగా విక్రయించినా చర్యలు తప్పవన్నారు. అంతే కాకుండా దుకాణాల వద్ద తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. నీరు, పొడి ఇసుక సిద్ధంగా ఉంచుకోవాలని తెలిపారు. నివాసాలు, విద్యాసంస్థలు, ఆస్పత్రులకు దూరంగా ఏర్పాటు చేసుకోవాలన్నారు. మండలంలో బాణసంచా దుకాణాల నిర్వహణకు నలుగురికి మాత్రమే అనుమతి ఇచ్చినట్లు తెలిపారు. గ్రామాల్లో విక్రయిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. టపాసులు కాల్చే సమయంలో అగ్నిప్రమాదాలు సంభవిస్తే 100, 101, 112కు కాల్ చేయాలని సూచించారు.

నేటి నుంచి కేజీఆర్ వాలీబాల్ టోర్నీ

• మంత్రి కాకాణిచే ప్రారంభం



ముస్తాబైన వాలీబాల్ స్టేడియం

ముత్తుకూరు : రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి జన్మదినం సందర్భంగా ముత్తుకూరులోని ఈఆర్ఆర్ఎం క్లబ్‌లో తలపెట్టిన 'సౌత్ ఇండియా ఇన్విటేషనల్ మెన్ అండ్ ఉమెన్ వాలీబాల్ లీగ్ టోర్నమెంట్' బుధవారం సాయంత్రం ప్రారంభంకానుంది. కేజీఆర్ వాలీబాల్ కప్ –2023 పేరుతో నిర్వహించే ఈ టోర్నమెంట్‌ను మంత్రి కాకాణి ప్రారంభిస్తారు. ఈ మేరకు వాలీబాల్ స్టేడియంను ముస్తాబు చేస్తున్నారు. ఫ్లడ్‌లైట్ల వెలుగులో జరిగే ఈ టోర్నీలో ఏపీ, తెలంగాణ, తమిళనాడు, కర్నాటక రాష్ట్రాల నుంచి జాతీయ, అంతర్జాతీయ జట్లు పాల్గొంటాయి. మంత్రితో పాటు ఎంపీలు ఆదాల ప్రభాకర్‌రెడ్డి, వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, డాక్టర్ గురుమూర్తి, జిల్లా కలెక్టర్ హరినారాయణన్, ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి తదితరులు ముఖ్య అతిథులుగా పాల్గొంటారు.

జోరు వర్షం



గంగపట్నం కూడలిలో నిలిచిన వర్షపునీరు

ఇందుకూరుపేట : మండల పరిధిలో మంగళవారం జోరు వర్షం కురిసింది. దీంతో ప్రయాణికులు, వ్యవసాయ కూలీలు ఇబ్బందులు పడ్డారు. ప్రధానంగా ద్విచక్ర వాహనదారులు రాకపోకలు సాగించేందుకు అవస్థలు పడ్డారు.

కాగా ఈ వర్షంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ఉప్పుటేరు వంతెనకు రూ.10 కోట్ల మంజూరు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

ఇందుకూరుపేట : మండలంలోని గంగపట్నం పల్లిపాళెం వద్ద ఉప్పుటేరుపై వంతెన నిర్మాణానికి సీఎం ప్రత్యేక నిధుల నుంచి రూ.10 కోట్లు మంజూరైనట్లు కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్న కుమార్‌రెడ్డి తెలిపారు. మండలంలోని గంగపట్నం గ్రామంలో మాజీ సర్పంచ్ రాయసం వెంకటేశ్వరరావు కాంస్య విగ్రహావిష్కరణలో మంగళవారం ఎమ్మెల్యే ప్రసన్న ఈ మేరకు మాట్లాడారు. ఈ వంతెన నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేస్తామన్నారు. అలాగే పల్లిపాళెంలో సీసీరోడ్ల నిర్మాణానికి నుడా నిధులు రూ.25 లక్షలు మంజూరైనట్లు వెల్లడించారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే సీవీ శేషారెడ్డి రాయసంతో ఆయనకు ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. ఈ కార్యక్రమంలో విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, ఎఫ్‌సీఐ మాజీ డైరెక్టర్ దువ్వూరు రాధాకృష్ణారెడ్డి, ఇందుకూరుపేట కో-ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ మావులూరు శ్రీనివాసులురెడ్డి, ఏపీఎల్డీఏ చైర్మన్ గొల్లపల్లి విజయ్‌కుమార్, డీసీఎమ్మెస్ డైరెక్టర్ గునుపాటి సురేష్‌రెడ్డి, జెడ్పీ వైస్ చైర్మన్ శ్రీహరి కోట జయలక్ష్మి, పార్టీ నేతలు బట్టేపాటి నరేంద్రరెడ్డి, హనుమంతరావు నాయుడు, రామచంద్ర నాయుడు, కొండ్లపూడి శ్రీనివాసులురెడ్డి, పంబాల జనార్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

